క్లుప్తంగా

కాణిపాకంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్‌నాయక్ దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పండితులు ఆశీర్వచనాలు అందించి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది కోదండపాణి, విగ్నేష్ ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం డీడీ అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం ఓ దాత నగదు విరాళం చేశారు. కర్నూలుకు చెందిన హరిషోత్తమరెడ్డి అన్నదానం ట్రస్ట్‌కు రూ.1,11,116 అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సిబ్బంది వాసు, విగ్నేష్ పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


ట్యాంకర్లతో నీటి సరఫరా



వడ్డూరులో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్న పంచాయతీ అధికారులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేశారు. వారం రోజులుగా బంగారుపాళెం దళితవాడలో అతిసార కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో గత మూడు రోజులుగా పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారు. పరీక్ష నిమిత్తం తిరుపతిలోని ఆ నీటిని పరీక్ష కేంద్రానికి పంపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా చేస్తున్నట్లు గ్రామ కార్యదర్శి శంకరయ్య తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు చెప్పారు.

డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: ఆసక్తి గల రైతులు ప్రభుత్వం అందించే డ్రిప్ పరికాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సూక్ష్మబిందు సేద్యం ఏపీడీ ఫజులూన్ బేగం అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులతో మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. బిందు సేద్యం పరికరాల కోసం అర్హులైన చిన్న, సన్నకారు రైతులు మండలంలోని రైతుసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5 ఎకరాల కంటే తక్కువ ఉన్న రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. ఐదు ఎకరాల కంటే ఎక్కువగా ఉన్న రైతులకు 70 శాతం రాయితీ అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఐఏఓ సతీష్, ఉద్యా సహాయకుడు ఢిల్లీప్రసాద్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు.

ఎలక్ట్రిక్ కిక్

- పెరుగుతున్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు
- కాలుష్య రహితంతో పాటు ఖర్చులు మిగులు
- రకరకాల వాహనాలు రోడ్లపైకి...
- రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా బయటకు..
- తప్పుతున్న ఇంధన కష్టాలు



ఎలక్ట్రిక్ స్కూటీకి చార్జింగ్



ఎలక్ట్రిక్ స్కూటీలు

కాణిపాకం: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది. ప్రతి పది మందిలో ముగ్గురి నుంచి నలుగురు ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలనే కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కార్ల వాడకం సైతం క్రమంగా పెరుగుతోంది. ధరను బట్టి స్కూటీలు, బైక్‌ల విక్రయాలు జరుగుతున్నాయి. వంద కిలో మీటర్ల స్పీడ్ దూసుకెళ్లే బైక్‌లకు ఒక ధర ఉండగా, 30 నుంచి 40 కిలో మీటర్ల స్పీడ్ వెళ్లే స్కూటీలకు మరో ధర పలుకుతుంది. వీటిలో కొన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం ఉండగా మరికొన్నింటికి ఎలాంటి రిజిస్ట్రేషన్లు, లైసెన్స్ అవసరం లేదు.

చిత్తూరు నగరంతోపాటు పలమనేరు, బంగారుపాళ్యం, కుప్పం ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహన షోరూంలు జోరుగా వెలిశాయి. జిల్లా వ్యాప్తంగా 10 వాహన ఏజెంట్లు ఉండగా... 35కు పైగా షోరూంలున్నాయి. మొత్తం 48వేలకుపైగా ఎలక్ట్రిక్ వాహనాలు తిరుగుతున్నాయి. నియంత్రణ లేకుండా పెరుగుతున్న పెట్రోల్ ధరను అధిగమించేందుకు కొత్తగా కొనుగోలు చేసే వాహన దారులు ఎలక్ట్రిక్ వాహనాలను కొంటున్నారు. డబ్బు ఆదాతోపాటు జీరో పాల్యూషన్ ఉంటుంది. ఈ వాహనానికి కేంద్ర ప్రభుత్వం సైతం ధరలో సబ్సిడీలు ఇవ్వడంతో వాహనదారులకు తక్కువ ధరకు లభించడంతో ఈ–వాహనాల వైపు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు.

ఈ స్కూటీతో భారీ ఆదా...

పెట్రోల్ స్కూటీతో పోల్చుకుంటే ఈ స్కూటీ కొనుగోలు చేస్తే భారీగా ఆదా చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో పెట్రోల్ స్కూటీ, ఈ స్కూటీ ధర రూ.90 వేలు ఉంది. పెట్రోల్ స్కూటీ లీటర్ పెట్రోలు 40 కిలోమీటర్లు మైలేజ్ ఇస్తోంది. లీటర్ పెట్రోల్ ధర ప్రస్తుతం రూ.110 ఉంది. రోజుకు లీటర్ పెట్రోల్ చొప్పున ఏడాదికి 365 లీటర్ల పెట్రోల్‌కుగానూ రూ.43,800 అవుతుంది. మూడేళ్లకు రూ. 1,31,400 స్కూటర్ ధరతో కలిపితే మొత్తం స్కూటీపై తిరిగితే రూ.2,21,000 ఖర్చు అవుతుంది.

80 కిలో మీటర్ల ప్రయాణం...

అదే ఎలక్ట్రిక్ స్కూటర్ ధర రూ.90 వేలు నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతోంది. దీనికి రోజుకు 2 యూనిట్ల కరెంట్ ఖర్చు అవుతుంది. యూనిట్ పవర్ ధర రూ.5 చొప్పున రోజుకు రూ.10 ఖర్చు అవుతుంది. దీంతో 80 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయొచ్చు. ఏడాదికి కరెంట్‌కు 365 యూనిట్లకు రూ.3,650 అదే మూడేళ్లకు కరెంట్‌కు అయ్యే ఖర్చు 10,950 మాత్రమే. అలాగే స్కూటీ ధర రూ.30 వేలు కలిపితే మూడేళ్లకు రూ. 1,00,950 మాత్రమే ఖర్చు అవుతుంది. పెట్రోల్ స్కూటీతో పోల్చితే రూ.1,20,450 ఎలక్ట్రిక్ స్కూటీ ద్వారా ఆదా అవుతుంది. అదేవిధంగా బైక్‌లు, కార్లకు సైతం అదేవిధంగా ఆదా అవుతుంది.

స్పీడు తగ్గితే.. నో రిజిస్ట్రేషన్..

గంటకు 50 కిలో మీటర్లలోపు స్పీడ్‌తో వెళ్లే స్కూటీలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదు, 50 కిలోమీటర్లకు పైగా 100/120 కిలోమీటర్ల స్పీడ్ దూసుకెళ్లే స్కూటీలకు, బైకులకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని రకాల నిబంధనలు వర్తిస్తాయి. ఎలక్ట్రిక్ బైక్‌లు వాటి స్పీడ్‌ను బట్టి రూ.1.30 లక్షల నుంచి రూ. 1.50 లక్షల వరకు మార్కెట్లో ధర పలుకుతుందని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

సబ్సిడీ అందిస్తున్న కేంద్రం

ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలు, కార్లు కొనుగోలు చేసే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ నజరానా ఇస్తోంది. స్కూటీలు, బైకులకు ఒక్కో వాహనం కొనుగోలు చేస్తే కొనుగోలుదారుడికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు సబ్సిడీని కేంద్రం అందిస్తోంది. పెట్రోల్ వినియోగం ఎంత తగ్గితే అంత పాల్యూషన్ తగ్గడంతోపాటు ఖర్చులు తగ్గించి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ప్రభుత్వం లక్ష్యం.

జమ్మని తిరుగుతున్నా..



మా ఇంట్లో మూడు ఎలక్ట్రిక్ బైక్‌లు ఉన్నాయి. మాలాంటి వాళ్లకు ఇది బాగానే ఉపయోగపడుతోంది. జమ్మని తిరుగుతున్నా. ఒక్కసారి చార్జ్ చేస్తే వేగాన్ని బట్టి నిత్యం 70 నుంచి 80 కిలోమీటర్లు తిరుగుతున్నాను. రాత్రివేళలో కరెంట్ చార్జింగ్ పెట్టుకొని ఉదయం పైసా ఖర్చులేకుండా తిరుగుతున్నాను. గతంలో నాకు పెట్రోల్ బైక్ ఉంటే దాంట్లో నిత్యం రూ.110 చెల్లించి లీటర్ పెట్రోల్ పోసేవాడిని, ఇప్పుడు ఆ డబ్బులు మిగిలిపోతున్నాయ్.

–శ్రీనివాసులు శెట్టి, చిత్తూరు

అబార్షన్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం

- డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అబార్షన్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో శనివారం కడుపులోనే చిదిమేస్తున్నారు.. అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. జిల్లాలో జరుగుతున్న అబార్షన్లు, ఇతరత్రా వివరాలపై ఆరా తీశారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ స్పందిస్తూ డెకాయి ఆపరేషన్లను మరింత వేగవంతం చేస్తామన్నారు. ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేయడంతో పాటు సీజ్ చేస్తామన్నారు. స్కానింగ్ యంత్రాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద తనిఖీ చేసేందుకు రవాణా, పోలీసు శాఖ దృష్టికి తీసుకెళ్లామన్నారు. లింగనిర్ధారణకు పాల్పడితే పీసీపీఎన్‌డీటీ చట్ట ప్రకారం జరిమానాతో పాటు కేసులు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అబార్షన్లు చేయాలని ఆమె పేర్కొన్నారు.

గుడిపాల ఎస్‌ఐగా రామ్మోహన్



గుడిపాల: గుడిపాల ఎస్‌ఐగా రామ్మోహన్ రానున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు గుడిపాల ఎస్‌ఐగా పనిచేస్తున్న రామ్మోహన్‌ను కాణిపాకం ఎస్‌ఐగా బదిలీపై వెళ్లారు. కాణిపాకంలో పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు గుడిపాలకు బదిలీపై వచ్చారు. మళ్లీ గుడిపాలకు రామ్మోహన్‌ను నియమించారు. 13వ తేదీన గుడిపాల ఎస్‌ఐగా రామ్మోహన్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

దళిత సంఘం నేతల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘ నాయకులు

తవణంపల్లె: విజయవాడ నడ్డిబొడ్డున ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో దళిత యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘ నాయకులు పాలాభిషేకం చేసి, గజమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధ్వంసానికి పాల్పడిన వారిని ప్రభుత్వం గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతమైతే దళితలంతా ఏకతాటిపైకి వచ్చి ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని విధ్వంసానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. దళిత సంఘ నాయకులు మురగన్, జగన్నాథం, షణ్ముగం, పరదేశి, మధుకుమార్, రీటాబాబు, ఏకరాజ్, మునేంద్ర, మణిరాజ్, అనంత్‌కుమార్, గోవిందు పాల్గొన్నారు.

కణ్ణన్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా నాగేంద్ర

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాల ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) చైర్మన్‌గా నాగేంద్రను ఎన్నుకున్నారని ఆ పాఠశాల హెచ్‌ఎం తులసిబాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్వహించినట్లు చెప్పారు. వైస్ చైర్మన్‌గా అమరావతి, కమిటీ కోఆప్షన్ సభ్యులుగా లక్ష్మీపతి, అడ్వకేట్ యూసఫ్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ నాగేంద్ర మాట్లాడుతూ అన్నిదానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. బీఎస్ కణ్ణన్ మరణంతో ఆయన తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం శెట్టియార్, కణ్ణమ్మ వందల కోట్ల విలువ చేసే స్థిర ఆస్తిని కణ్ణన్ పాఠశాల, కళాశాలకు ఉచితంగా ఇచ్చారన్నారు. కణ్ణన్ పాఠశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు మంచి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు. పాఠశాల బలోపేతానికి నూతన కమిటీ కృషి చేస్తుందని వెల్లడించారు.

విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుదర్శనరావు

పూతలపట్టు: మండలంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల యాజమాన్యం బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు బ్రిడ్జి కోర్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ సుదర్శనరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు కావాల్సిన ప్రాథమిక అంశాలు పరిచయం చేయడంలో బ్రిడ్జి కోర్సు ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ చంద్రశేఖర నాయుడు మాట్లాడుతూ బ్రిడ్జి కోర్సును బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అతిథులు శశికళ, సాయి శిరీష, ప్రిన్సిపల్ నవీన్ కిశోరి, పాల్గొన్నారు.

పేదలందరికీ అందుబాటులో వైద్యం



కారకాంపల్లెలో గర్భిణులకు వైద్య సేవలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



చారాలలో ..



గుడిపాల: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తవణంపల్లె: పల్లెల్లో నివసిస్తున్న పేదలకు అందుబాటులో వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని కారకాంపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 35 మందికి వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. తదనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పల్లెల్లో పరిసరాలను శుభ్రం చేసుకుని పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. ప్రజల ముంగిటకే వస్తున్న డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి..

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చారాలలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో 45 మందికి వైద్య సేవలందించారు. వృద్ధాప్యంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: ప్రజల చెంతకే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకు వైద్య సేవలు

గుడిపాల: గ్రామాల్లో ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలను అందజేస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. శనివారం రామభద్రాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాలకు రావాల్సి ఉండేదని, ప్రస్తుతం మీ గ్రామంలోకి వైద్యసేవలు తీసుకొచ్చారన్నారు. అనంతరం గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది అనిత, అనురాధ, చంద్ర, శివగామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐరాల: ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు, సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుతగా సీనియర్ యూటీఎఫ్ నాయకుడు కృష్ణారెడ్డి, నాయకులతో కలిసి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటాలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏకాంబరం, మండల గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నో విజయాలు సాధించాం



యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: నిర్బంధాలు, కేసులు, అరెస్టులు అధిగమించి యూటీఎఫ్ ఎన్నో విజయాలు సాధించిందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. యూటీఎఫ్ జెండాను ఎగురవేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఎందరో కార్యకర్తలు, నాయకుల కృషి త్యాగాల ఫలితమే యూటీఎఫ్ సంఘం అని అన్నారు. జిల్లా అధ్యక్షులు సోమశేఖరనాయుడు మాట్లాడుతూ స్వర్ణోత్సవాల లక్ష్యంగా ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దక్షిణామూర్తి, సుధాకర్‌రెడ్డి, రెహానాబేగం, రెడ్డెప్ప, ఎస్‌పీ బాషా పాల్గొన్నారు.

కూటమికి సూపర్ గండం

- సూపర్‌బజార్ డైరెక్టర్లలో జనసేన, బీజేపీకి దక్కని చోటు
- మైనారిటీలు, ఎస్సీలను కరివేపాకుగా వాడుకుంటున్న వైనం
- ఏఎంసీ చైర్మన్ గిరిపై జనసేన, బీజేపీ, ఎస్సీ నేతల కన్ను
- తమకు తగిన ప్రాధాన్యత దక్కలేదని మదనపడుతున్న వైనం



పలమనేరు సూపర్‌బజార్

పలమనేరు: తాజాగా కూటమి ప్రభుత్వం పలమనేరు సహకార సూపర్‌బజార్‌కు పార్టీ ఇన్‌పర్సన్‌తో పాటు పది మంది డైరెక్టర్లను నియమించింది. వీరిలో జనసేన, బీజేపీలకు స్థానం లేకుండా పోయింది. ఇదే ఇప్పుడు కూటమి నేతల్లో అసంతృప్తికి కారణమైందనే మాట జోరుగా వినిపిస్తోంది. సూపర్‌బజార్‌లో స్థానం లేకుండా పోవడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టునైనా దక్కించుకోవాలనే ఆలోచనలో బీజేపీ, జనసేన నేతలున్నట్టు తెలుస్తోంది. సూపర్‌బజార్ అధ్యక్షుడిగా సుభాష్ చంద్రబోస్ 38 ఏళ్లుగా ఉన్నారు. సూపర్‌బజార్ గడువు ఈనెల తొలివారంలో ముగిసింది. దీంతో దీనికి ఎన్నికలకు నిర్వహించడానికి బదులు అధికార పార్టీ తమ అధికారంతో ఆరునెలల పాటు ఉండేలా పార్టీ ఇన్ పర్సన్‌గా బోస్ సోదరుడు, టీడీపీ నాయకుడు ఆర్వీ బాలాజీకే ఇచ్చి అదే కుటుంబానికి చెందిన వ్యక్తికే సూపర్ పగ్గాలనిచ్చారు. కనీసం డైరెక్టర్లలోనైనా తమకు స్థానం ఉంటుందని జనసేన, బీజేపీ నేతలు భావించినా ఆ ఊసే లేకుండా పోయింది. పట్టణంలో 20వేలకు పైగా ముస్లింలున్నారు. అలాగే 22వేల దాకా ఎస్సీలున్నారు. టీడీపీకి చెందిన ఈ వర్గానికి సైతం సూపర్ డైరెక్టర్ల పదవులు దక్కలేదు. దీంతో సొంత పార్టీకి చెందిన ఆ నేతలే అంతర్మథనంలో ఉన్నట్టు సమాచారం. దీనికి తోడు కూటమిలోని సహచర పార్టీలు దీనిపై అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది.

సూపర్ దెబ్బకు ఏఎంసీ చైర్మన్‌కు పెరిగిన పోటీ

సూపర్‌బజార్‌కు సంబంధించి అంతా టీడీపీ హవా కనిపించడంతో కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అయినా తమకు దక్కుతుందనే ఆశతో ఉన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలో అన్నీ సాఫీగానే సాగుతున్నాయనుకున్న స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డికి సైతం రాబోవు వ్యవహారాలు కత్తిమీదసాములా మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఏఎంసీ చైర్మన్ పదవికి టీడీపీకి చెందిన పదిమంది వరకూ ఇప్పటికే క్యూలో ఉన్నారు. ఆ పార్టీలోనే ఎస్సీలకు ఇవ్వాలని కొందరు, మైనారిటీలు ఎక్కువగా ఉన్నందున తమకే దక్కాలని ఆ నేతలు, టీడీపీకి వెన్నెముక లాంటి బీసీలకే చైర్మన్ దక్కాలని బీసీ నేతలు, రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని ఆదే పార్టీకి చెందిన వారు బరిలో ఉన్నారు. ఇలా ఒకే పార్టీలో నాలుగు స్తంభాలాటగా ఇలా ఉంటే..కూటమిలో భాగస్వాములైన తమకేమీ ప్రాధాన్యత లేదా? అని భాగస్వామ్య నేతలు సైతం భావిస్తున్నట్టు ఇక్కడ మారుతున్న రాజకీయ పరిణామాలు చెబుతున్నాయి. ఏదేమైనా కూటమి నేతలతో సయోధ్య చేస్తూ రాబోయే నామినేటెడ్ పోస్టులను స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఎలా చేస్తారనేది వేచి చూడాల్సిందే.

కొత్తచట్టాలపై అవగాహన కల్పించండి

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ వీఎన్ మణికంఠ చందోలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

కార్వేటినగరం: కొత్తచట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, నేరాలు జరగకుండా చూడాలని చిత్తూరు జిల్లా ఎస్పీ వీఎన్ మణికంఠ చందోలు అన్నారు. శనివారం కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్తచట్టాలపై మహిళా పోలీసుల ద్వారా కళాశాలల్లో విద్యార్థులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ బాలికలపై జరిగే అఘాయిత్యాలు, మోసగించడం, వేధించడంపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి, నేరాలు జరగకుండా చూడాలన్నారు. సర్కిల్ పరిధిలోని క్రైమ్ రేటును తగ్గించాలని, ప్రజలతో స్నేహభావంతో మెలుగుతూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీఐ హనుమంతప్ప, ఏఎస్‌ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.